అందరి ఆరోగ్యం లక్ష్యంగా...



గొల్ల కంచరపాలెం దరి తోటవీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న సిబ్బంది, వలంటీర్లు

- 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు సిద్ధం
- 1వ తేదీ నుంచి జేఏసీ క్యాంపులు ప్రారంభం

కంచరపాలెం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా అక్టోబర్ ఒకటి నుంచి 45 రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించడానికి సర్వే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేందుకు జోన్–5 పరిధిలోని విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ నియోజకవర్గాల్లోని యూపీహెచ్‌సీలను సిద్ధం చేశారు. ఆయా యూపీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఏఎన్‌ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఈ నెల 14 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై సర్వే నిర్వహిస్తున్నారు.

యూపీహెచ్‌సీల వారీగా..

జోన్–5 పరిధిలోని యూపీహెచ్‌సీలు బాపూజీనగర్, ములగాడ, కంచరపాలెం(ఆర్పీపేట), రైల్వే న్యూకాలనీ, నరసింహనగర్, ఇందిరానగర్, శివనగర్, విద్యుత్‌నగర్(ఎన్‌జీజీవో కాలనీ), అంబేద్కర్ కాలనీ, భవానీగార్డెన్స్, ఏఎస్ఆర్‌నగర్, గాంధీజీవీధి(మల్కాపురం)లో ఆయా సచివాలయాల సిబ్బంది సర్వే చేస్తున్నారు. రక్తపోటు(బీపీ), షుగర్ పరీక్షలు చేస్తున్నారు. రక్తహీనతతో బాధ పడేవారు, పౌష్టికాహార లోపంతో బాధపడేవారని ఈ సర్వేలో గుర్తిస్తున్నారు. జోన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బరువు తక్కువ, రక్త హీనత, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి మందులు అందిస్తున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు స్పెషలిస్ట్‌లతో వైద్యం

దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ సమస్యలు లాంటివి గుర్తిస్తున్నారు. వారిని ఆయా యూపీహెచ్‌సీ పరిధిలోని నిర్వహించే వైద్య శిబిరాలకు తరలించి స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. అవసరమైతే ఉన్నత వైద్యశాలలకు తరలించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా అవసరమయ్యే వైద్యఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి అనారోగ్య సమస్యలను తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

వైద్య శిబిరాలు నిర్వహించే యూపీహెచ్‌సీలు, తేదీలు

యూపీహెచ్‌సీ	సచివాలయాల సంఖ్య	శిబిరం తేదీ అక్టోబర్
బాపూజీనగర్	07	04 (బుధ)
ములగాడ	06	05 (గురు)
కంచరపాలెం(ఆర్పీపేట)	07	06 (శుక్ర)
రైల్వేన్యూకాలనీ,	08	07 (శని)
నరసింహనగర్,	05	10 (మంగళ)
ఇందిరానగర్	06	11 (బుధ)
శివనగర్,	11	13 (శుక్ర)
విద్యుత్‌నగర్(ఎన్‌జీజీవో)	11	16 (సోమ)
అంబేద్కర్‌కాలనీ	09	17 (మంగళ)
భవానీగార్డెన్స్	08	18 (బుధ)
ఏఎస్ఆర్‌నగర్	08	19 (గురు)
గాంధీజీవీధి(మల్కాపురం)	04	19 (గురు)

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు స్పందన

జోన్–5 పరిధిలో 13 వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు మంచి స్పందన లభిస్తుంది. యూపీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. జోన్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ‹జేఏసీ› వైద్య శిబిరాలు నిర్వహించే తేదీలు ప్రజలకు తెలియజేస్తున్నాం. అక్టోబర్ 04 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష› మెడికల్ క్యాంప్‌లను ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– ఆర్జీవీ కృష్ణ,
జోనల్ కమిషనర్, జోన్–5, జ్ఞానాపురం

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



నరసింహనగర్‌లో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం, సిబ్బంది

మర్రిపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జీవీఎంసీ 50వ వార్డులో మంగళవారం ప్రారంభమైంది. 288 సచివాలయం పరిధిలో ఏఎన్ఎం లక్ష్మి ,ఆశా వర్కర్ చంద్రకళ, వలంటీరు సంధ్య ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. మాధవధార, నరసింహనగర్‌లో మొత్తం 65 ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబ సభ్యులకు బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వ్యాధి తీవ్రత ఉంటే తదుపరి చికిత్స కోసం టోకెన్ మంజూరు చేసి అక్టోబర్ 16న మాధవస్వామి కల్యాణ మండపంలో జరగనున్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వెళ్లాలని సూచించారు.

క్లుప్తంగా

3న యోగాసనాల పోటీలు

సీతంపేట: ఉత్తరాంధ్రలో విశిష్ట యోగా ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న శ్రీరామం ఇంటిగ్రల్ యోగా(శ్రీయోగా) ఆధ్వర్యంలో గురుదేవులు రాపర్తి రామారావు శత జయంతి సందర్భంగా అక్టోబరు 3న ద్వారకానగర్ బీవీకే కళాశాలలో యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ ప్రతినిధి కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఈ నెల 30వ తేదీలోగా 99083 69568 ఫోన్ నంబరులో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

అర్ధ నారీశ్వర గణపతి అలంకరణలో దుర్గా గణపతి



సీతంపేటలో అర్ధ నారీశ్వర గణపతి అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గా గణపతి

సీతంపేట: స్థానిక సీతంపేట కూడలిలో దేవదాయ శాఖ పరిధిలో గల దుర్గా గణపతి ఆలయంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు చివరి రోజున అర్ధ నారీశ్వర అలంకరణలో దుర్గా గణపతి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రదర్శన అలరించింది. బుధవారం సాయంత్రం సిద్ధి బుద్ధి సమేత దుర్గా గణపతి ఉత్సవమూర్తుల పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తామని కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఈవో రమాభాయి తెలిపారు.

కొండవాలులో ఫాగింగ్

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఇందిరానగర్ – 1, జవహర్‌లాల్ నెహ్రూ నగర్, జై భారత్ నగర్, శ్రీనివాస్‌నగర్ కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గంకల కవిత ఆదేశాల మేరకు మలేరియా నివారణ విభాగం సిబ్బంది మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల వార్డు పర్యటనలో విషజ్వరాలపై స్థానికులు వినతిపత్రాలు ఇవ్వడంతో సంబంధిత అధికారులతో కార్పొరేటర్ కవిత మాట్లాడి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణయ్యకు ఘన నివాళి



బ్రాహ్మణయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మురళీనగర్: వాకర్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు, టెన్నిస్ పార్కు, మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఎం.బ్రాహ్మణయ్య (90) మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. బ్రాహ్మణయ్య ఆధ్వర్యంలో మురళీనగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, ఎన్.బుచ్చయ్య, రామకృష్ణారెడ్డి, పుసులేటి ఉషాకిరణ్, భరణికాన రామారావు నివాళులలర్పించారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్యస్వామి ఏకాంత ఆలయంలో మంగళవారం శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్రనామార్చన, విభూది, పుష్పాలతో అర్చన చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

సంకురాత్రి ఫౌండేషన్‌కు ప్రగతి ట్రస్ట్ నిధుల మళ్లింపు



ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్‌కు చెక్కు అందిస్తున్న ప్రగతి ట్రస్ట్ ప్రతినిధులు

సీతంపేట: సమాజ సేవలో ముందుండే ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ నిధులను మరో ప్రతిష్టాత్మక సేవా సంస్థకు బదిలీ చేశారు. ప్రగతి ట్రస్ట్ కీలక సభ్యులు చాలా మంది కాలం చేయడం.. ప్రస్తుత భవనాన్ని ఏయూ తన అవసరాలకు తిరిగి వెనక్కి తీసుకున్న నేపథ్యంలో ట్రస్టీలు ఈ నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర మొట్టమొదటి లోకాయుక్త ఆవుల సాంబశివరావు సతీమణి జయప్రదాదేవి దశాబ్దాల క్రితం ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించారు. విశాఖ కేంద్రంగా జయప్రదాదేవి మేనేజింగ్ ట్రస్టీగా.. ప్రగతి ట్రస్ట్ కార్యకలాపాలు మొదలయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రగతి ట్రస్ట్ నిధులను కాకినాడ కేంద్రంగా నిస్వార్థ సేవ చేస్తున్న సంకురాత్రి ఫౌండేషన్‌కు మళ్లించాలని సభ్యులు నిర్ణయించారు. శ్రీకిరణ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆప్తమాలజీ పేరుతో రాష్ట్రంలో అతి పెద్ద గొలుసు కంటి ఆస్పత్రులను సంకురాత్రి ఫౌండేషన్ నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 7 లక్షల మంది కంటి రోగులకు సేవలు అందించింది. సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌కు ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ కోటీ రూపాయల నిధులను చెక్కు రూపంలో అందజేసింది. ప్రముఖ ఆడిటర్, సార్క్ అసోసియేట్స్ చార్టెడ్ అకౌంటెంట్స్ వ్యవస్థాపకుడు ఆకుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాల్తేర్ క్లబ్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ నిధులను సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చంద్రశేఖర్‌కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పి.సుధాకర్, కల్యాణ్ చక్రవర్తి, చిక్కాల సరోజిని దేవి, గాయత్రి విద్యా సంస్థల అధినేత డాక్టర్ దక్షిణామూర్తి, రియర్ అడ్మిరల్ డాక్టర్ శ్రీనివాస్, ఆచార్య ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

సీతమ్మధార : ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దొండపర్తిలో నివసిస్తున్న పిల్ల వినోద్‌కుమార్ (28) వెల్డింగ్ పనులు చేస్తుండేవాడు. భార్య సూర్యదేవి మంగ, ఇద్దరు పిల్లలు సంతానం. మూడేళ్లుగా భార్య కన్నవారి ఇంట్లోనే భార్య, పిల్లలతో కలిసి ఉంటున్నాడు. మరోవైపు అదే ఇంటిలో వినోద్ కుమార్‌తో పనులు చేసే మల్లేష్, నగిరెడ్డి కూడా ఉంటున్నారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో మల్లేష్ నిద్రలేచి చూసేసరికి వినోద్‌కుమార్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే మృతుని భార్యకు తెలియజేసి 108కు తెలియజేయగా సిబ్బంది పరిశీలించి అప్పటికే వినోద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తల్లి లీలావతి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురళీనగర్‌లో చైన్ స్నాచింగ్

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఓ మహిళ మెడలో 75 గ్రాముల బంగారు గొలుసు దొంగతనం చేసిన ఘటన వెలుగుచూసింది. ఐదో పట్టణ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టి.శర్వాణి(47) అనే మహిళ మురళీనగర్ స్కేటింగ్ పార్కు వద్ద నివాసం ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం ఆమె స్నేహితురాలితో కలిసి బృందావన్ పార్కు వద్ద వినాయకుడి మండపంలో పారాయణ చదవడానికి వెళ్లారు. తిరిగి ఇంటికి చేరుకునే క్రమంలో మురళీనగర్ బ్యాంక్ స్ట్రీట్ సెక్టార్–7 వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి శర్వాణి మెడలో ఉన్న 75 గ్రాముల బంగారు గొలుసును తెంచుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితురాలు కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం డీసీపీ నాగన్న, క్రైం ఏడీసీపీ గంగాధర్, ఇన్‌చార్జ్ క్రైం సీఐ గొలగాని అప్పారావు, క్రైం ఎస్‌ఐ సునీల్ ఘటన స్థలానికి చేరుకుని సమీక్షించారు. సీసీ కెమెరాల ఫుటేజీలు వీక్షించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

గణపతి సన్నిధిలో అన్నసమారాధన



సీతంపేటలో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్



భక్తులకు వడ్డన చేస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు నాయుడు వీధిలో శ్రీకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముఖ్య అతిథిగా పాల్గొని అన్న సమారాధన ప్రారంభించి భక్తులకు వడ్డించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సారిపిల్లి గంగరాజు, బోర రమణ, షణ్ముఖ్, అనిల్, ఉదయ్, నవీన్, సాయి, వేణుగోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

14వ వార్డులో అన్నదానం

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ కార్యాలయం ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో పూజలు చేశారు. వీకేసీపీఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, శివగణేష్, కిరణ్ రాజు, నీలి రవి, అంబటి శైలేష్, అమర్నాథ్ రెడ్డి, కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, వి.ప్రసాద్, కో – ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు శిక్ష

దొండపర్తి: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. న్యూపోర్టు, హార్బర్, మల్కాపురం స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందిని ఒకటో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్‌కు 10 రోజులు జైలు శిక్ష విధించారు. మిగిలిన వారికి మొత్తంగా రూ.1.78 లక్షలు జరిమానా వేశారు. ఆరిలోవ పరిధిలో 16 మందికి రూ.30,500, పీఎం పాలెం పరిధిలో 14 మందికి రూ.49 వేలు, గోపాలపట్నం స్టేషన్ పరిధిలో 10 మందికి రూ.26 వేలు, పెందుర్తిలో 20 మందికి రూ.47,500 జరిమానా విధించారు. అలాగే కంచరపాలెం స్టేషన్ పరిధిలో 20 మందికి రూ.1.04 లక్షల జరిమానా విధించడంతో పాటు వారిలో ఏడుగురికి వారం రోజులు జైలు శిక్ష విధించారు. గాజువాక పరిధిలో 15 మందికి రూ.38 వేలు, టూ టౌన్ స్టేషన్ పరిధిలో 15 మందికి రూ.1.19 లక్షలు జరిమానా వేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతమ్మధార : రైల్వే డిపార్టుమెంట్‌లో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్న చిన్నిపిల్లి వాసు (55) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి రైల్వే న్యూ కాలనీలో ఈ నెల 23న పుట్‌పాత్‌పై అపస్మారక స్థితిలో ఉండగా గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఇటీవల కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడంతో కుమారుడు చిన్నిపిల్లి శ్రావణ్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

51వ వార్డులో దళిత సేవా సంపర్క్



మట్లాడుతున్న సోషల్ జస్టిస్ మినిస్టర్ నారాయణస్వామి

మర్రిపాలెం: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు గ్రామాల్లో దళిత బస్తీ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 51వ వార్డు అంబేద్కర్ కాలనీలో మంగళవారం దళిత మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత బస్తీ సేవ కార్యక్రమానికి బీజేపీ సోషల్ జస్టిస్ మినిస్టర్ నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని జన్మదినం పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు దళిత గ్రామాల్లో సేవా సంపర్క్ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ మోర్చాకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, జనరల్ సెక్రటరీ కాశీ విశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షుడు కోడూరు సంజీవరావు, బంగారురాజు, పోతురాజు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం



సమావేశాలు ప్రారంభిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 10వ ద్వి–వార్షిక సర్వసభ్య సమావేశాలు మంగళవారం తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐఆర్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య రన్నింగ్ స్టాఫ్, ట్రాక్ మెయింటెనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. వీరిని సూపర్‌వైజర్ కేటగిరీకి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎన్ఎఫ్ఐఆర్ గుర్తింపు పొందిన యూనియన్ల పోరాటంతో త్వరలోనే ఎన్‌పీఎస్ రద్దవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కే కే, కే–ఆర్ లైన్‌లో ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులకు వర్క్ టు రూల్ అమలు చేయాలని, సిబ్బందికి పనిభారం తగ్గేలా చూడాలని కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్దార్థ్ కటి, వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్ కుమార్, డివిజనల్ కో–ఆర్డినేటర్ టి.వి.మాళీశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎల్‌ఎం పథకంతో బహుళ ప్రయోజనాలు

- రైతులకు సబ్సిడీపై రుణాల మంజూరు
- స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సింహాచలం



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్మైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ: ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకంతో రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని స్మైల్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్ఎల్ఎం) పథకంలో భాగంగా రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 368 మంది రైతులు పాల్గొన్న ఈ సదస్సును ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎల్ఎం కింద గొర్రెలు–మేకలు, నాటు కోళ్లు, పందుల పెంపకందార్లతో పాటు పాడి రైతులు పశుదాణా ఉత్పత్తి కోసం సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. గ్రామ స్థాయిలో రైతులకు వ్యాపార సరళిలో ఎన్ఎల్ఎం పథకం ఎంతో మేలు చేకూర్చుతుందన్నారు. ఈ పథకం కింద ప్రాజెక్టు ఏర్పాటు కోసం ముందుకొచ్చిన రైతులకు 50 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను కూడా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ మాట్లాడుతూ ఎన్ఎల్ఎం పథకం లక్ష్యాల గురించి రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పలువురు అధికారులు బ్యాచ్‌ల వారీగా అవగాహన కల్పించారు. ఎన్ఎల్ఎం పథకం కోసం లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారం, ఎంత సబ్సిడీ లభిస్తుందో వివరించారు. ఉప సంచాలకుడు డాక్టర్ కె.కరుణాకరరావు, డీసీబీసీయూ జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీరామ్, డాక్టర్ ఎం.ప్రసాదరావు, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.శ్రీనుబాబు పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

మానవతా విలువలు అవసరం



రవీంద్ర శుక్లాను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మానవతా విలువలు యువత కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పూర్వ విద్యాశాఖ మంత్రి డాక్టర రవీంద్ర శుక్లా అన్నారు. మంగళవారం ఆయన ఏయూ హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలను విద్యా వ్యవస్థలో అంతర్భాగం చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా తాను పనిచేసిన సమయంలో తీసుకువచ్చిన మార్పులను వివరించారు. భారతదేశ ఔన్నత్యాన్ని నిలుపుతూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేలా పాలకులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ రవీంద్ర శుక్లాను హిందీ విభాగ ఆచార్యులు నల్ల సత్యనారాయణ ఘనంగా సత్కరించారు.

'మైనర్లు వాహనం నడపడం నేరం'

సీతమ్మధార : మైనర్లు వాహనాలు నడపడం చట్టపరంగా నేరమని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ రామమూర్తి అన్నారు. సీతమ్మధారలోని నారాయణ స్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు భద్రత, నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. జీబ్రా క్రాసింగ్ వద్ద పాదచారులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోడ్డు దాటే ముందు రెండు వైపులా చూడాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో డ్రైవింగ్ చేసినప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.

వివాహిత అదృశ్యం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు భోగాపురపు వారి వీధికి చెందిన లింగాల ధనలక్ష్మి (23) అనే వివాహిత సోమవారం ఇంటి నుంచి అదృశ్యమయింది. విజయనగరం జిల్లా బలిజిపేట మండలం పలగర గ్రామానికి చెందిన గుడివాడ బాబూరావుకు ధనలక్ష్మితో ఈ ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో పనిచేస్తున్న బాబూరావు, ధనలక్ష్మితో తగరపువలసలో కాపురం పెట్టారు. సోమవారం ఉదయం బాబూరావు ఉద్యోగా నికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చి చూడగా ఇంటి వద్ద భార్య కనిపించలేదు. మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లలోకి చేరిన కొండచిలువ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎస్ఎస్‌టీఎల్ వెనుక గోడ సమీపం నుంచి ఇళ్లల్లోకి మంగళవారం కొండచిలువ రావటంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇంటి కాంపౌండ్ వాల్‌లోకి వచ్చి బాత్ రూమ్‌కు సమీపంలోని పొదల్లో దూరటంతో విషయాన్ని స్నేక్ స్నేచర్ కిరణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో కిరణ్ అక్కడకు చేరుకొని సుమారు 8 అడుగుల కొండచిలువను పట్టుకొని తీసుకెళ్లారు. దీంతో అక్కడి వాసులంతా ఊపిరిపీల్చుకున్నారు.